క్లుప్తంగా

ఘనంగా కంఠమహేశ్వర స్వామి బోనాలు



యాదగిరిగుట్ట రూరల్ : బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని పెద్ద కందుకూరు గ్రామంలో శనివారం శ్రీ కంఠమహేశ్వరస్వామి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున్న బోనాలను తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీమగాని రాములు, ఉపసర్పంచ్ మచ్చ లక్ష్మీనారాయణ, గౌడ సంఘం అధ్యక్షులు మనోహర్‌గౌడ్, కృష్ణగౌడ్, రమేష్, శంకర్, సత్యనారాయణ, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొండూర్‌లో..



చౌటుప్పల్ : పెద్దకొండూర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు, యువతులు

చౌటుప్పల్ : మండలంలోని పెద్దకొండూర్ గ్రామంలో శనివారం కంఠమహేశ్వరస్వామి–సూరమాంబదేవి బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు డప్పుచప్పుళ్లతో బోనాలతో దేవాలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మెరుగు మల్లేశంకు సన్మానం



మల్లేశంను సన్మానిస్తున్న ప్రముఖులు

ఆత్మకూరు(ఎం) : మండలంలోని రహీంఖాన్ పేటకు చెందిన కవి, తెలుగు భాషా శతక రచయిత, సహజ కవి మెరుగు మల్లేశంను కాళోజి జయంతి సందర్భంగా తెలుగు భాషా అభ్యసనాభివృద్ధి సమితి నల్లగొండ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి శీలం భద్రయ్య, సృహజన సాహితి అధ్యక్షుడు పెరుమాళ్ల ఆనంద్, కవులు సాగర్ల సత్తయ్య, మాదగాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

భువనగిరిటౌన్ : మధ్యాహ్న భోజన వంట కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, పెంచిన వేతనాలు వెంటనే విడుదల చేయాలని లేకుంటే ఈనెల 20 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పావని జంపాల, రవీందర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం పట్టణంలో సంఘం జిల్లా ప్రథమ మహాసభను ముంతాజ్ బేగం, వసంతల అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సమైఖ్య రాష్ట్ర నాయకులు నలిని, వంట కార్మికులు ముంతాజ్‌బేగం, వసంత, మణెమ్మ, బుచ్చమ్మ, తస్లీమా, జమ్మూ మమత, సంధ్య పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం



ప్రశంసపత్రాలు అందజేస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.పూర్ణచందర్‌రాజు

ఆత్మకూరు(ఎం) : రక్తదానం మహాదానమని, రక్తదానం ఎందరో ప్రాణాలను కాపాడుతుందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల చైర్మన్ పి.పూర్ణచందర్‌రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం చేసిన నేతాజీ యువజన మండలి సభ్యులకు రాష్ట్ర గవర్నర్‌చే పంపబడిన ప్రశంసపత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో నేతాజీ యువజన మండలి అధ్యక్షుడు పి.శ్యంతన్‌రాజు, కార్యదర్శి ఎలిమినేటి మురళీకృష్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రజా చైతన్య యాత్ర

సంస్థాన్ నారాయణపురం : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లమల్ల కృష్ణారెడ్డి చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర మండలంలోని పోర్ల గడ్డతండా, రాధనగర్‌తండా, సీత్యాతండా, బోటిమీదితండా, కడపగండి, వాచ్యాతండా, పల్లగట్టుతండా, జనగాం గ్రామాల్లో శనివారం కొనసాగింది. ఈ యాత్రలో భాగంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నట్లు కృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గూడూరు వెంకట్‌రెడ్డి, రాసమళ్ల యాదయ్య, గడ్డం రవి, శంకర్, నర్సింహ, జంగయ్య, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా కార్యాలయాలు

- మోత్కూరు, రామన్నపేట మండల కేంద్రాలలో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయాల ఏర్పాటు
- నేడు మోత్కూరులో ప్రారంభించనున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్
- రేపు రామన్నపేటలో ప్రారంభించనున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



రామన్నపేటలో ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సబ్ డివిజన్ కార్యాలయం



మోత్కూర్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయం

రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో సర్కిల్ కార్యాలయంతో పాటు, జిల్లాలోని రామన్నపేట, మోత్కూరు మండల కేంద్రాలలో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాల ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు చేశారు. ఈనెల 11న రామన్నపేటలో ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ పనులపై పర్యవేక్షణ, మానిటరింగ్‌ను పెంచడం, నాణ్యతను, పారదర్శకత కోసం ప్రభుత్వం అదనంగా చీఫ్ ఇంజనీర్, సర్కిల్ కార్యాలయాలు, డివిజన్ ఆఫీసులు, సబ్‌డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం మే 23న ఉత్తర్వులు జారీ చేసింది.

రామన్నపేట మండలంలోని 24, వలిగొండ మండలంలోని 37 పంచాయతీలకు సేవలు..

గతంలో అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రామన్నపేటలో 2009 వరకు పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీరింగ్ కార్యాలయం ఉండేది. అప్పట్లో దాని పరిధిలో రామన్నపేటతో పాటు వలిగొండ, మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల మండలాలు ఉండేవి. నియోజకవర్గం రద్దుతో సబ్‌డివిజన్ కార్యాలయాన్ని ఎత్తివేశారు. రామన్నపేటను నకిరేకల్‌లో మిగిలిన మండలాలను, భువనగిరి, తుంగతుర్తి డివిజన్‌లలో విలీనం చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో రామన్నపేటను ఆలేరు సబ్‌డివిజన్‌లో విలీనం చేశారు. ఇబ్బందుల నేపథ్యంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సిఫారసుతో రామన్నపేటలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రామన్నపేట సబ్ డివిజన్ పరిధిలో రామన్నపేట, వలిగొండ మండలాలను చేర్చారు. రామన్నపేట మండలంలోని 24గ్రామపంచాయతీలు, వలిగొండ మండలంలోని 37 గ్రామపంచాయతీలకు సబ్ డివిజన్ కార్యాలయం తన సేవలను అందించనుంది. ఆయా గ్రామాల్లోని పనులు, పంచాయతీరాజ్ రోడ్లు, లింక్ రోడ్ల అభివృద్ధి, మరమ్మతులు, నిర్వహణ ఈ కార్యాలయం పరిధిలోకి వస్తాయి.

మోత్కూరు : మోత్కూరు పాత తాలూకా పంచాయతీ సమితికి పూర్వ వైభవం సంతరించుకోనుంది. మండల కేంద్రంలో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ ఇంజనీరింగ్ కార్యాలయ ప్రారంభానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ కార్యాలయాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ నేడు (ఆదివారం) ప్రారంభించనున్నారు. ఈ కార్యాలయం పరిధిలో తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని మోత్కూరు, అడ్డగూడూరు మండలాలు, ఆలేరు నియోజకవర్గం పరిధిలోని ఆత్మకూరు(ఎం) మండలాలను చేర్చారు. ఈ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 55 గ్రామపంచాయతీల ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లకు దూర, వ్యయభారం తప్పనుంది.

జిల్లాల పునర్విభజనతో కోల్పోయిన సబ్ డివిజన్..

జిల్లాల పునఃర్విభజనలో మోత్కూరు సబ్ డివిజన్‌ను సూర్యాపేట జిల్లాలోని నాగారానికి తరలించారు. ఆలేరు సబ్‌డివిజన్ పరిధిలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాలను చేర్చడంలో ఇంత కాలం పని చేశాయి. స్థానిక ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ కృషితో తిరిగి పీఆర్ ఇంజనీరింగ్ సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు నోచుకుంది.

ఇబ్బందులు తొలగనున్నాయి..



కొత్తగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయాలు ఏర్పాటు హర్షణీయం. పనులపై పర్యవేక్షణ, నాణ్యత పెరుగుతుంది. గ్రామాల్లో పనులు చేయించిన ప్రజాప్రతినిధులు, వీడీసీలు, కాంట్రాక్టర్లకు బిల్లులు చేయించుకునే పని సులువు అవుతుంది. సబ్ డివిజన్ పునఃప్రారంభంతో ఇబ్బందులు తొలగనున్నాయి.

– గుత్తా నర్సింహారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, రామన్నపేట

కార్యాలయం ఏర్పాటు హర్షణీయం



మోత్కూరులో పీఆర్ డీఈ కార్యాలయం ఏర్పాటు హర్షణీయం. ఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తుండడం చాలా సంతోషంగా ఉంది. ఇంతకు ముందు ఆలేరులో ఉండేది. పీఆర్ పనుల కోసం ఆలేరు వరకు పోవాల్సివచ్చేది. ఆత్మకూరు(ఎం) నుంచి ఆలేరుకు చాలా దూర, వ్యయ భారం అయ్యేది. ఇప్పుడు మోత్కూరులో ప్రారంభిస్తున్నందున పనులు సకాలంలో అవుతాయన్న నమ్మకం ఉంది.

– భాషబోయిన ఉప్పలయ్యయాదవ్, సర్పంచ్ కూరెళ్ల, ఆత్మకూరు(ఎం)

ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి గుణపాఠం చెప్పాలి

- ఎమ్మెల్యే గొంగిడి సునీత



ఆలేరురూరల్ : ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీత

యాదగిరిగుట్ట : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.2కోట్ల 60లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మితే అధోగతి పాలుకాక తప్పదన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధా, వైస్ చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్లు గౌళికార్ అరుణ, బూడిద సురేందర్, సీస విజయలక్ష్మి, ముక్కెర్ల మల్లేష్, దండబోయిన అనిల్, ఆవుల మమత, తాళ్లపల్లి నాగరాజు, బిట్టు సరోజా, బబ్బూరి మౌనిక, కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, సయ్యద్ బాబా, గోర్ల పద్మ, రిజ్వానా, మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య, పట్టణ అధ్యక్షులు పెలిమెల్లి శ్రీధర్, మండల, పట్టణ సెక్రటరీ జనరల్‌లు కసావు శ్రీనివాస్‌గౌడ్, పాపట్ల నరహరి, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, నాయకులు తదితరులున్నారు.

రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండ

ఆలేరురూరల్ : రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి రుణమాఫీ లబ్ధిదారుల ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో 8 సహకార బ్యాంక్ సొసైటీల ద్వారా రూ.15వేల కోట్ల 11లక్షలు నిధులు లబ్ధిదారులకు రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 534 చెరువులకు మరమ్మతులు చేసి 27 చెక్ డ్యామ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఆలేరు సింగిల్ విండో చైర్మన్ మొగులగాని మల్లేషం అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో మదర్ డైయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, డీఎల్ఓ శ్రీనివాస్ జీఎం వసంతరావు, నరసింహారెడ్డి, యాదగిరిగుట్ట సింగల్ విండో చైర్మన్ నర్సింహరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతిప్రవీణ్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్లు పత్తి వెంకటేష్, కుండె సంపత్, వివిధ మండలాల సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు తదిరతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



బీఆర్ఎస్‌లోకి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

మోత్కూరు : వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు ప్రతిఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. శనివారం తిరుమలగిరిలోని ఆయన నివాసంలో మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన కాంగ్రెస్, సీపీఐ పార్టీల నుంచి పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పి.రమేష్, మండల రైతు బంధు అధ్యక్షులు కొండా సోంమల్లు, మాజీ ఎంపీటీసీ పానుగుల్ల విష్ణుమూర్తి, నాయకులు తొంట శ్రీను, లొడంగి రామకృష్ణ, దండబోయిన వెంకన్న, కన్నెబోయిన లింగం, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్రవెల్లి పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

జాతరలు ఐక్యతాభావాన్ని పెంపొందిస్తాయి

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట : గ్రామాల్లో జరిగే పండుగలు, జాతరలు ప్రజల్లో ఐక్యతాభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని మునిపంపుల గ్రామంలో శ్రావణమాసం చివరి శనివారం రోజున మునీశ్వర జాతరను కనుల పండువగా నిర్వహించారు. ఈ జాతరలో ఆయన పాల్గొని మునీశ్వరగుట్టపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను శాలువాతో సత్కరించి ప్రసాదం అందజేశారు. గ్రామస్తులు పలహార బండ్లను భజనలు, కోలాటాలతో గుట్టవద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. జాతరలో ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి, సర్పంచ్‌లు యాదాసు కవిత, కడమంచి సంధ్య, ఎంపీటీసీ గాదె పారిజాత, గొరిగె నర్సింహ, మాజీసర్పంచ్‌లు డోగిపర్తి జానకిరాములు, కట్ట యాదయ్య, బీఆర్ఎస్, సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి పోచబోయిన మల్లేశం, బొడ్డుపల్లి వెంకటేశం, మామిండ్ల అశోక్, డోగిపర్తి సుభాష్, ఉడతల శ్రీనివాస్, జంపాల ఉమాపతి, శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజీతోనే కేసులు సత్వర పరిష్కారం



చౌటుప్పల్ : లోక్‌అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తి మహతివైష్ణవి

చౌటుప్పల్ : రాజీతోనే కేసులు సత్వర పరిష్కారమవుతాయని చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి మహతి వైష్ణవి అన్నారు. శనివారం పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మెగా లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో 1254 కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కారమైనట్లు ఆమె తెలిపారు. కేసులను రాజీ చేసేందుకు న్యాయవాదులు, పోలీసులు కక్షిదారులను ప్రోత్సహించాలని సూచించారు. కక్షిదారులు లోక్‌అదాలతలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి నర్సింహారెడ్డి, న్యాయవాదులు పి.పరమేష్, టి.పరమేష్, శేఖర్, స్వాతి, ఏ.శ్రీనివాస్, చలపతి, రవీందర్, రమేష్, వేణు, జంగయ్య, రవీందర్ ఉన్నారు.

రామన్నపేట : కక్షిదారులు రాజీమార్గంతో ఇరుపక్షాలకు గెలుపు వరిస్తుందని రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రదీప్, అదనపు కోర్టు జడ్జి ఎస్.చందన తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన లోక్‌అదాలత్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. క్షణికావేశంతో నమోదు అయ్యే కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకుంటే విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కాంపాటి యాదగిరి, జినుకల ప్రభాకర్, ఎంఎ మజీద్, పీపీ అవినాష్, దినేష్, స్వామి, శ్రవన్, గంగాభవానీ, బాలగోని శివరాజు పాల్గొన్నారు.

వర్రె సింగన్న సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్, నాయకులు

మోత్కూరు : మండలంలోని సదర్శాపురం గ్రామానికి చెందిన వర్రె సింగన్న(70) కుటుంబం ఆ గ్రామానికి చేసిన సేవలు మరువలేనివని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. శనివారం అనారోగ్యంతో మృతి చెందిన సింగన్న మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, సమాచార హక్కు శాఖ మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింగన్న మృతికి సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహ్మయ్య సతీమణి లక్ష్మి, రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బొబ్బల గోపాలకృష్ణయ్య, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఉప్పల సత్యంయాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు అయోధ్యయాదవ్, పల్లెబోయిన కాశీరాములు, రావుల భిక్షం, శ్యాంసుందర్, మధుసూదన్, రమేష్, ప్రొఫెసర్లు నరేందర్‌రెడ్డి, మధు, వెంకటేశ్వర్లు, నయిమ్, ఆనంద్, ప్రసన్న, రజిత, లక్ష్మారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వీబీ.నరసింహ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం



కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

ఆలేరురూరల్ : గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాఘవాపురం గ్రామంలో కురుమ సంఘం భవన నిర్మాణానికి రూ.5లక్షలు ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బక్క రాంప్రసాద్, కరిక మల్లేషం, సంతోష్, శ్రీశైలం, ఐలయ్య, బాలయ్య, బాబు నరసయ్య, పాపయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

పట్టణంలోని 3వ వార్డుకు చెందిన 50మంది యువకులు, మహిళలు శనివారం డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే గొంగిడి సునీతను గెలిపించుకుంటామని ప్రజలు వివిధ పార్టీల నుంచి స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, కౌన్సిలర్లు బేతిరాములు, మాజీ సర్పంచ్ దాసి సంతోష్, పత్తి వెంకటేష్, కుండె సంపత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భాష గొప్పతనాన్ని చాటిన మహనీయుడు కాళోజీ



యాదగిరిగుట్ట : కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



మోత్కూర్ : కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

యాదగిరిగుట్ట : ప్రజా కవి కాళోజీ నారాయణరావు తెలంగాణ భాష, యాస గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా పట్టణంలో శనివారం నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలంగాణ మాండలికానికి, యాసకు కాళోజీతోనే సరైన గౌరవం లభించిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధా, వైస్ చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్లు గౌళికార్ అరుణ, బూడిద సురేందర్, సీస విజయలక్ష్మి, ఆవుల మమత, తాళ్లపల్లి నాగరాజు, కోఆప్షన్ సభ్యులు సయ్యద్‌బాబా, గోర్ల పద్మ, రిజ్వానా, మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు పెలిమెల్లి శ్రీధర్, మండల, పట్టణ సెక్రటరీ జనరల్‌లు కసావు శ్రీనివాస్‌గౌడ్, పాపట్ల నరహరి, నాయకులు క్లోం స్వాతి, సత్యం, శిఖ శ్రీనివాస్ తదితరులున్నారు.

భువనగిరిటౌన్ : భువనగిరి జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు 109వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.సుధీర్, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో శనివారం ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు 109వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నర్సింహ, వెంకన్న, మార్గోని వెంకన్న, కీర్తన పాల్గొన్నారు.

కాళోజీ సేవలు మరువలేనివి

చౌటుప్పల్ : తెలంగాణ కోసం ప్రజాకవి కాళోజీ నారాయణరావు చేసిన సేవలు మరువలేనివని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఊడుగు మల్లేష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో శనివారం కాళోజీ 109వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు గోశిక రవీందర్, శ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.

మోత్కూరు : తెలుగు భాషను చైతన్యం చేయడంలో ప్రజా కవి కాళోజీ నిరంతరం కృషి చేశారని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, ప్రజా భారతి సాహితి సంస్థ ప్రధాన కార్యదర్శి గుమిడెల్లి వెంకన్న అన్నారు. శనివారం మున్సిపల్ కేంద్రంలో వేర్వేరుగా కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి పట్టణ అధ్యక్షుడు నిలిగొండ మత్స్యగిరి, అవిశెట్టి అవిలుమల్లు, ఎస్సీ, ఎస్టీ నాయకులు తొంట భాస్కర్, ఆకుల రవి, ఇటుకల రాజు, బుంగ యాదయ్య, తొంట తిరుపతి, ప్రజాభారతి సంస్థ సభ్యులు బోళ్ల హన్మంతు, రాజు, కె.యాకస్వామి, మనోహర్, గ్రంథాలయ ఇన్‌చార్జ్ బాబుచారి, విద్యార్థులు ఉన్నారు.

బొమ్మలరామారం : ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతిని శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శోభచంద్రమౌళి, ఉపసర్పంచ్ జూపల్లి భరత్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు : ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు జయంతిని శనివారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి తుప్పతి బీరప్ప ఆధ్వర్యంలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సైదులు, పున్నయ్య, కుమార్, రమేష్ పాల్గొన్నారు.

ప్రజలంతా భాగస్వాములు కావాలి



మోటకొండూర్ : ఇంటింటికి మట్టి సేకరణలో పాల్గొన్న సూదగాని హరిశంకర్‌గౌడ్

చౌటుప్పల్ : అమరవీరుల స్మారకార్థం ఢిల్లీలో చేపట్టిన అమృతవాటిక నిర్మాణంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, బీజేపీ మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, మండల అధ్యక్షుడు రిక్కల సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటికి మట్టి సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బాతరాజు సత్యం, గుడ్డేటి యాదయ్య, నాయకులు అర్ధ వెంకట్‌రెడ్డి, పాలకూర్ల జంగయ్య, ఏనుగు సుధాకర్‌రెడ్డి, ఊడుగు యాదయ్య, బత్తుల జంగయ్య, కృష్ణ, చంద్రారెడ్డి, కృష్ణ ఉన్నారు.

బీజేపీ పాలనలోనే దేశం సుభిక్షం

తుర్కపల్లి : బీజేపీ పాలనలోనే దేశం సుభిక్షంగా ఉంటుందని బీజేపీ మండల అధ్యక్షుడు కొక్కొండ లక్ష్మీనారాయణ, బొమ్మలరామారం మండల ఇన్‌చార్జ్ సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని దత్తాయపల్లిలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నా దేశం – నామట్టి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మట్టిని సేకరించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి డొంకెన రాజుగౌడ్, వెంకటేశ్, బూత్ అధ్యక్షుడు ఎల్లేశ్, బాలకృష్ణ, కృష్ణ, కొండల్, శివ, వెంకట్‌రెడ్డి, సూరి, శిరీష, రేశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మోటకొండూర్ : మండలంలోని వర్టూర్, చందేపల్లి, చామాపూర్ గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదగాని హరిశంకర్‌గౌడ్ ఆజాదీకా అమృత్ మహోత్సవంలో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నా దేశం –నా మట్టి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి మట్టిని సేకరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జోరుక ఎల్లేష్, ఉపేందర్, శ్రీధర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, ఉదయ్‌కిరణ్, జితేందర్‌రెడ్డి, పుల్లె నరేష్, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

27న పద్మశాలి యువజన సంఘం ఎన్నికలు

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి పద్మశాలి యువజన సంఘం ఎన్నికలను ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు తెలిపారు. శనివారం పట్టణంలో ఎన్నికల నియమావళి కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మహాజన సంఘం ఉపాధ్యక్షుడు అంకం మురళి, యువజన సంఘం అధ్యక్షుడు సూరెపల్లి రాము, భారత బాలరత్నం, కడవేరు చంద్రమౌళి, సంగెం చంద్రయ్య, గుండు పాండు, కర్నాటి అంజమ్మ, గంజి యుగేంధర్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ బీజేపీ టికెట్‌కు మొగులయ్య దరఖాస్తు

రామన్నపేట : నకిరేకల్ అసెంబ్లీ బీజేపీ టికెట్ కోసం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఆయన వెంట పార్టీ అసెంబ్లీ కోకన్వీనర్ మదూరి ప్రభాకర్‌రావు, మండలాల అధ్యక్షులు తాటిపాముల శివకృష్ణ, నర్సింహ, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

పోస్టర్ల ఆవిష్కరణ

చౌటుప్పల్ : ముస్లింల సమస్యలు పరిష్కరించాలని నేడు (ఆదివారం) నల్లగొండలో నిర్వహించనున్న ముస్లింల బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను శనివారం పట్టణ కేంద్రంలో జమియాతె ఉలేమ ఏ హింద్ మండల అధ్యక్షుడు మౌలన ఖమ్రొద్దీన్, కార్యదర్శి మీర్ షాహెద్‌అలీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జబ్బార్, షరీఫ్, వహీద్, మీర్ అమ్జద్, ఉన్నారు.

నాభిశిలకు జలాభిషేకం

వలిగొండ : మండలంలోని మొగిలిపాకలో నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా శనివారం నాభిశిలకు కుంకుమ అర్చనలు, జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముద్దసాని శశికళారెడ్డి, ముద్దసాని కిరణ్‌రెడ్డి, ముద్దసాని శ్రీధర్ రెడ్డి, ఘంట హరికృష్ణ, భిక్షపతి, బందారపు రాములు, జక్కుల శంకరయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

భువనగిరి : మండలంలోని బొల్లేపల్లి గ్రామానికి చెందిన సుమారు 30మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన యువకులు శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, సుధాకర్, జక్కా రాఘవేందర్‌రెడ్డి, పాండు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా లక్ష్మణ్

సంస్థాన్ నారాయణపురం : బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా బొల్లేపల్లి లక్ష్మణ్‌ను నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం వెల్లడించారు.

కాంగ్రెస్ గెలుపునకు పనిచేయాలి

భువనగిరి టౌన్ : కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతిఒక్క యువజన కాంగ్రెస్ నాయకుడు పనిచేయాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు ఎండీ అవేస్ చిస్తీ అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్, గంజ్ మార్కెట్‌లో హాథ్ జోడో, బూత్ జోడో డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బర్రె నరేష్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి యనగండ్ల సుధాకర్, భువనగిరి అసెంబ్లీ ఉపాధ్యక్షుడు కొల్లూరు రాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

అధిక మెజార్టీతో బీఆర్ఎస్ గెలుపు

భువనగిరి : వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ నుంచి పైళ్ల శేఖర్‌రెడ్డి అధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్ అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య, మార్కెట్ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు వేణుగోపాల్ రెడ్డి, అజీమోద్దీన్, నర్సింగ్‌నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మదర్ థెరిసా అంతర్జాతీయ అవార్డుకు ముగ్గురు ఎంపిక

మిర్యాలగూడ టౌన్: మదర్ థెరిస్సా అంతర్జాతీయ అవార్డుకు మిర్యాలగూడ నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. ఈమేరకు ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ మెనేజ్‌మెంట్ శనివారం పోస్టు ద్వారా ఆహ్వానం పంపింది. ఫెయిత్ బంజారా అనాథాశ్రమం నిర్వాహకులు ధీరావత్ హన్యా నాయక్, ధీరావత్ రమాబాయిలు కుష్టు రోగులు, వృద్ధులకు చేసిన సేవలకుగాను, అదే విధంగా ధీరావత్ సుధారాణి అందించిన వైద్య సేవలకుగాను ఈ అవార్డులకు ఎంపికయ్యారు. అవార్డులను ఈ నెల 30న న్యూఢిల్లీలో అందుకోనున్నట్లు హన్యానాయక్ తెలిపారు.

20 అడుగులకు చేరిన డిండి ప్రాజెక్టు నీటిమట్టం

డిండి: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు దుందుబి వాగు పరవళ్లు తొక్కుతుండటంతో డిండి ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతోంది. డిండి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 36 అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 20 అడుగుల వరకు నీరు చేరింది. ప్రాజెక్టులోకి 900 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తోందని ఇరిగేషన్ ఏఈ ఫయాజ్ తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు ధర్మారెడ్డి మృతి


ధర్మారెడ్డి(ఫైల్)

హిమాయత్‌నగర్: స్వాతంత్ర్య సమరయోధుడు మందడి ధర్మారెడ్డి(97) మృతిచెందారు. శనివారం హైదరాబాద్‌లో దిల్‌షుక్‌నగర్‌లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు ధర్మారెడ్డి మనుమరాలు శ్రావ్యరెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి గ్రామానికి చెందిన ధర్మారెడ్డి స్వాతంత్ర్య ఉద్యమం సమయంలో కీలకపాత్ర పోషించారు. జాతిపిత మహాత్మ గాంధీ నేతృత్వంలో జరిగిన శాంతియుత పోరాటాల్లో ధర్మారెడ్డి కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలో రాజాకార్ల దౌర్జన్యాల సమయంలో ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేశారు. ధర్మారెడ్డికి భార్య జానకమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

చేనేత కార్మికుల ఆరోగ్య స్థితి, భద్రత పరిశీలన


చేనేతల ఆరోగ్య స్థితిగతులు, తదితర వివరాలు అడిగి తెలుసుకుంటున్న బృందం

మోత్కూరు: యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షీల నారాయణ బృందం, శేఖర్‌రెడ్డి, డాక్టర్ సంకు శంకర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినర్స్ బృందం శనివారం మోత్కూరులో చేనేత కార్మికుల వ్యక్తిగత ఆరోగ్య స్థితి, వృత్తిపరమైన భద్రతను పరిశీలించింది. ఈ సందర్భంగా మహిళా చేనేత కార్మికుల ఆరోగ్య స్థితి, సాధికారతపై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో చేనేత కార్మికుల్లో పురుషులు 51 శాతం, మహిళలు 49 శాతంగా ఉన్నారని వారు తెలిపారు. వారి వెంట యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత మహిళా విభాగం సహాయ కార్యదర్శి రేగోటి ఉషారాణి ఉన్నారు.

సమ్మె సరైంది కాదు

భానుపురి (సూర్యాపేట): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 11వ తేదీ నుంచి అంగన్‌వాడీలు సమ్మె చేయాలని భావించడం సరైంది కాదని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగ సంఘాల జేఏసీ జనరల్ సెక్రెటరీ జ్యోతిపద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏ ఒక్క అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ సమ్మెలో భాగస్వామ్యం కావొద్దని సూచించారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని, చిన్నారులు, గర్భిణులు, బాలింతలను ఇబ్బంది పెట్టే ప్రక్రియకు చేపట్టవద్దని కోరారు. ఉద్యోగులతో సమానంగా పీఆర్సీ పెరిగినప్పుడల్లా అంగన్‌వాడీలకు 30 శాతం జీతం పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలిపారు.

ఎలియాస్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు


ఎలియాస్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గాదె ఎలియాస్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఎలియాస్‌రెడ్డి కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఎలియాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలు అందించారన్నారు. పార్టీ పరంగా బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్, మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతికిశోర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, మహేష్‌గౌడ్ మధుసూదన్‌రెడ్డి, ఆంథోనిరెడ్డి ఉన్నారు.

'జీ-20' సదస్సులో జిగేల్..

తేలియా రుమాల్

- ప్రాచీన చేనేత కళకు ప్రపంచ గుర్తింపు
- దేశం మొత్తంగా పుట్టపాక గ్రామంలోనే తేలియా రుమాల్
- వందేళ్ల క్రితమే ప్రకృతి రంగులతో తయారు
- చేనేత కళాకారులకు దక్కిన అత్యుత్తమ అవార్డులు


దారాలపై డిజైన్ వేస్తున్న యువకుడు

నల్లగొండ డెస్క్

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాక గ్రామం చేనేత కళాకారులు రూపొందించిన 'తేలియా రుమాల్' ప్రపంచ ఖ్యాతి గడించింది. జీ-20 శిఖరాగ్ర సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన భారతీయ హస్తకళల ప్రదర్శనలో తేలియా రుమాల్‌కు చోటుదక్కింది. ఈ వస్త్రాలను సదస్సుకు వచ్చే విదేశీ ప్రతినిధులు కొనుగోలు చేసే అవకాశం ఉంది. తేలియా రుమాల్ అనేది ఒక రకమైన వస్త్రం. తేలియా రుమాల్.. పుట్టపాక ప్రత్యేకం. ఇక్కడి చేనేత కళాకారులు తమ కళా నైపుణ్యానికి పదును పెడుతూ, సృజనాత్మకతను వెలికి తీస్తూ, పోటీతత్వంతో అనేక కొత్త కొత్త డిజైన్లను రుపొందిస్తున్నారు. తేలియా రుమాల్ వస్త్రంతో పుట్టపాక అనే మారుమూల పల్లె చేనేత పరంగా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచింది. దాదాపు వంద సంవత్సరాల క్రితమే పుట్టపాక గ్రామంలో తేలియా రుమాల్ వస్త్రంతో నేసిన చేనేత ఉత్పత్తులు అరబ్ దేశాలకు ఎగుమతి చేసినట్లు ఇక్కడి చేనేత కళాకారులు చెప్పారు. తేలియా రుమాల్.. వేసవి కాలంలో చల్లగా, చలి కాలంలో వెచ్చగా ఉండడమే కాక సుగంధ వాసనలు వెదజల్లే ప్రత్యేకత కలిగి ఉంటుంది.

ప్రత్యేక గుర్తింపు

పుట్టపాక తేలియా రుమాల్ అనే వస్త్రంకు పోస్టల్ శాఖ అరుదైన గౌరవం ఇచ్చింది. తేలియా రుమాల్ అనే వస్త్ర తయారీ కళను పోస్టల్ శాఖ ప్టోసల్ కవర్‌తో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించింది. తేలియా రూమాల్‌కు భౌగోళిక గుర్తింపు(జీఐ) కూడా ఉంది.

పద్మశ్రీ అవార్డు సొంతం..

తేలియా రుమాల్ భారత దేశంలో మరెక్కడా నేయరు. దేశం మొత్తం మీద పుట్టపాక గ్రామంలోనే తెలియా రుమాల్ తయారు చేస్తారు. ఈ వస్త్రం నేసినందుకు పుట్టపాక గ్రామానికి చెందిన చేనేత కళాకారులు గజం గోవర్ధన్, గజం రాములుకు భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు అందజేసింది. దీంతో పాటు పలు జాతీయ అవార్డులు కూడా ఈ గ్రామ చేనేత కళాకారులకు వచ్చాయి.




తేలియా రుమాల్ వస్త్రం


మగ్గంపై తయారవుతున్న తేలియా రుమాల్ వస్త్రం

తేలియా రుమాల్ తయారీకి వాడే ప్రకృతి రంగులివే..

గుమ్మడి రంగు: గుమ్మడి రంగు వేయడానికి.. అడవి పసుపు(పచ్చి పసుపు), తేయాకు, తమలపాకు కలిపి గుమ్మడి రంగును తయారు చేస్తారు.

తేలియా రంగు: సున్నపు రాయి, అడవి పసుపు, నువ్వుల నూనె, నిమ్మకాయ రసంతో కలిపి తయారు చేస్తారు.

ఇండిగో రంగు: ఇండిగో అనే మొక్కను ఉడకబెట్టి కేక్ మాదిరిగా మారుస్తారు. ఇండిగో మొక్కను చైన్నై నుంచి తీసుకువస్తున్నారు. సున్నం, కుంకుడు రసం, నిమ్మరసం కలిపి తయారు చేస్తారు.

నల్ల రంగు: పాత ఇనుప సామానును 25రోజులు నీటిలో నానబెట్టి తుప్పు పట్టిస్తారు. తాటిబెల్లం, ఇనుప తుప్పు, నల్ల కరక్కాయ పొడి, కుంకుడు రసం, నిమ్మ రసం కలిపి నల్లటి రంగుగా తయారు చేస్తారు.

ఇలా తయారు చేసిన రంగులతోనే ప్రాచీన తేలియా రుమాల్ వస్త్రంకు రంగులు అద్దుతారు.


గుమ్మడి రంగు తయారీ


నానబెట్టిన కరక్కాయ పొడి


ఆముదపు పొట్టు


గొర్రె ఎరువు


నువ్వుల నూనెలో శుద్ధిచేసిన దారాలు

ధర ఇలా..

తేలియా రుమాల్ వస్త్రంతో తలపాగాలు, చీరలు, దుప్పటా, కార్ఫ్, డ్రెస్‌మెటీయల్‌తో పాటు ఇతర దుస్తులను తయారు చేస్తున్నారు. ఈ వస్త్రానికి మీటరు ధర కనిష్టంగా రూ.5 వేలు.. గరిష్టంగా రూ.25వేలు ఉంటుంది. చీరలు డిజైన్లను బట్టి రూ.30వేల నుంచి రూ.2 లక్షల వరకు ధర ఉంది. తేలియా రుమాల్ వస్త్రం తయారీకి ఎక్కువ రోజులే పడుతుంది. 60 మీటర్ల వస్త్రం తయారు చేయడానికి.. నూలు ప్రాసెస్ సమయం 21 రోజులతో పాటు అదనంగా నెల రోజులు పడుతుంది. ఒక చీర నేయడానికి.. నూలు ప్రాసెస్, రంగుల అద్దడం, ఆరబెట్టడానికి సమయం కలిపి మొత్తంగా మూడు నెలల సమయం పడుతుందని చేనేత కళాకారులు చెప్పారు. ఇవి ఎండాకాలం చల్లగా, చలికాలం వెచ్చగా ఉండడమే గాక సుగంధ వాసనలు వెదజల్లుతాయి.


దారాలను శుద్ధి చేస్తున్న చేనేత కళాకారుడు


నూలును ఆరబెడుతున్న చేనేత కళాకారుడు

ఎలా తయారు చేస్తారంటే..

పుట్టపాకలో నేసే ప్రాచీన తేలియా రుమాల్ వస్త్రాలకు ప్రకృతి రంగులే ఆధారం. తెల్ల దారానికి ప్రకృతి రంగులు గుమ్మడి రంగు, తేలియా రంగు, ఇండిగో, నల్ల రంగును ఉపయోగిస్తారు.

- మొదటగా తెల్ల దారానికి జిగురు తొలగించేందుకు గాను ఒక రోజు నీళ్లలో నానబెట్టి నీడలో ఆరబెడతారు. ఇలా వారం రోజులు కష్టపడి తెల్లధారానికి ఉన్న జిగురు తొలగిస్తారు.
- ఆ తర్వాత దారాన్ని శుద్ధి చేయడం కోసం కరక్కాయ పొడి కిలో ఒక్కంటికి 150 గ్రాముల చొప్పున, అల్లం 10గ్రాములతో కలిపి శుద్ధి చేస్తారు.
- ఇలా శుద్ధిచేసిన నూలును 21 రోజుల పాటు ప్రాసెస్ చేస్తారు. మొదట ఆముదపు పొట్టును కాల్చి బూడిద చేస్తారు. నువ్వుల నూనెతో బూడిదను కలిపి, నూలును అందులో ఉంచుతారు. రోజంతా నీటితో కలిపిన గొర్రె ఎరువులో నానబెడతారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నూలును ఉతికి శుభ్రపరిచి.. ఆరబెడతారు. మళ్లీ అందులోనే నానబెడతారు. ఇలా 21రోజులు చేస్తారు.
- ఆ తర్వాత వస్త్రం అవసరాన్ని బట్టి వార్పుపై అవసరమైనంత పొడవులో దారాలను తీస్తారు. మగ్గంపై కావాల్సిన తీరులో డిజైన్లతో కూడిన వస్త్రాన్ని రూపొందిస్తారు.

సమ్మె బాటలో అంగన్‌వాడీలు

- ఈ నెల 11 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు నోటీసులు అందజేత
- కేంద్రం తాళాలను ఇవ్వాలని సూచించిన సంబంధిత అధికారులు
- అంగన్‌వాడీలను పర్యవేక్షించాలని సూపర్‌వైజర్లకు ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో 4,203 కేంద్రాలు


అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహిస్తున్న సంక్షేమ శాఖ అధికారులు


సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు

భువనగిరిటౌన్: శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వివిధ శాఖల్లోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ ఉద్యోగ భద్రతకు సంబంధించి ప్రభుత్వంపై పోరాటాలు చేస్తున్నారు. ఈ సమయంలో తమ డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీ టీచర్లు కూడా ఈ నెల 11 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు. అంగన్‌వాడీ టీచర్లు తమకు నెలకు రూ.26 వేల వేతనం ప్రకటించాలని, పదవీ విరమణ తరువాత రూ.లక్షకు బదులు రూ.10లక్షలు అందించాలని, తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు. ఈమేరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు.

ప్రభుత్వం స్పందించకుంటే..

యాదాద్రి భువనగిరి జిల్లాలో 901 అంగన్‌వాడీలు కేంద్రాలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 1,209 కేంద్రాలు, నల్లగొండ జిల్లాలో 2,093 కేంద్రాలు ఉన్నాయి. తాము అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించడంతో పాటు ప్రభుత్వ చేపట్టే అనేక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నామని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని పేర్కొంటున్నారు. కాగా.. యాదాద్రి జిల్లాలో ఉన్న 901 అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 700 కేంద్రాల్లోని అంగన్‌వాడీ టీచర్లు, సూర్యాపేట జిల్లాలోని 1209 కేంద్రాలకు గాను 900 కేంద్రాల వారు, అదేవిధంగా నల్లగొండ జిల్లాలోని 2,093 కేంద్రాలకుగాను 1,800 కేంద్రాల వారు సమ్మెలోకి వెళ్లనున్నారు.

హెచ్చరికలు జారీ చేసిన అధికారులు

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెకు దిగితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఆ శాఖ ఉన్నతాధికారులు, సీడీపీఓలు సూపర్‌వైజర్లకు ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు సమ్మెకు వెళ్లకుండా చూడాలని, ఒకవేళ వెళ్తే అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు ఇచ్చి సమ్మెకు వెళ్లాలని ఆదేశించారు. వాటి పర్యవేక్షణ అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పర్యవేక్షించి, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు.

ప్రధాన డిమాండ్లు ఇవీ...

- అంగన్‌వాడీల వేతనం రూ.26వేలుగా నిర్ధారించాలి.
- ఉద్యోగ విరమణ వయసును 60 ఏళ్లకు కుదించాలి.
- విరమణ పొందిన టీచర్‌కు రూ.10 లక్షలు, హెల్పర్కకు రూ.5లక్షలు ఇవ్వాలి.
- రిటైర్మెంట్ నాటికి తీసుకునే వేతనంలో సగం మేర పెన్షన్ ఇవ్వాలి.
- సీనియారిటీ ఆధారంగా వేతనాల పెంపుతోపాటు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
- ఐసీడీఎస్ పథకానికి నిధులు పెంచి మరింత బలోపేతం చేయాలి.
- కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి.

11 నుంచి సమ్మెలోకి వెళ్తాం



ఎన్నో ఏళ్లుగా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కాక టీచర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. అదనపు బాధ్యతలు పెంచి వేతనం తక్కువ ఇస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.26వేల వేతనం, రిటైర్మెంట్ కింద రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు ఇవ్వాలి. ఈనెల 11నుంచి అనుముల ప్రాజెక్టు మొత్తం టీచర్లు, ఆయాలు నిరవధిక సమ్మెలో పాల్గొంటారు. చర్చలకు పిలువకుంటే సమ్మెను ఉధృతం చేస్తాం.
– బూరుగు స్వప్న, యూనియన్ అధ్యక్షురాలు

సమస్యలు పరిష్కరించాలి



అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ల రిటైర్మెంట్ ప్యాకేజీ మోసపూరితంగా ఉంది. చర్చల సమయంలో ప్రకటించిన సాయం.. ఇప్పుడు నిర్ణయించిన సాయం సగానికి పడిపోయింది. ఆసరా పెన్షన్ ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదు. పదవీ విరమణ నాటికి తీసుకుంటున్న వేతనంలో సగం మేర పెన్షన్ రూపంలో ఇవ్వాలి. పని భారం పెరుగుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ టీచర్ల విధులను సర్దుబాటు చేయాలి.
– సీహెచ్, రామకుమారి, అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియర్ జిల్లా కార్యదర్శి

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చాక సమస్యలన్నీ పరిష్కరిస్తామని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని నల్లగొండలోని కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు శనివారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని చెప్పి మాట తప్పారన్నారు. ఎన్నికల ముందు అన్ని బంధులు పెడుతున్నారని, ఔటర్ వద్ద భూములు అమ్మి అకౌంట్లలో జమచేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 3 మాసాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఈ నెల 17న సోనియాగాంధీ వస్తున్నారని, హామీలు ఇస్తారని తెలిపారు.


మాదిగల పోరాటానికి న్యాయమైన ముగింపునివ్వాలి


ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వాలని ఎంపీని కోరుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నల్లగొండ టౌన్: ఎస్సీ వర్గీకరణకు మాదిగలు 29 ఏళ్లుగా చేస్తున్న సుదీర్ఘ పోరాటానికి న్యాయమైన ముగింపు పలకాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 18 నుంచి 22 వరకు జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ఆధ్వర్యంలో మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న మాదిగ, మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నల్లగొండ జిల్లా కందుకూరి సోమన్న దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి వచ్చిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మెమోరండం సమర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్ర అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి వర్గీకరణపై కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. ఎమ్మార్పీఎస్ దీక్షకు తాను మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బోడ సునీల్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన దీక్షా కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు మేడి శంకర్ మాదిగ, ఎంజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీడిమెట్ల రవీందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో-కన్వీనర్ ఎరిగి శ్రీశైలం మాదిగ, ఎంఎస్పీ నల్గొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జ చిన్నమాదిగ, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమిరే స్వామి మాదిగ, మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గడుసు సైదిస్, మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలేని యాదయ్య మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జీడిమెట్ల రమేష్ ఎంఎస్పీ మండల అధ్యక్షులు, మహిళా సంఘం అధ్యక్షురాలు కూరపాటి కమలమ్మ, ఎంఎస్పీ సీనియర్ నాయకులు వంగూరి ప్రసాద్, ఎమ్మార్పీఎస్ పట్టణ నాయకులు మాసార వెంకన్న కత్తుల సన్నీ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు శనివారం ప్రాజెక్టు నాలుగు గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువ నుంచి 5,742 ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్టస్థాయికి చేరువలో ఉండడంతో నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా 5,230 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వల ద్వారా 379 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గేట్ల ద్వారా, కాల్వలకు కలిపి నుండి 5,742 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 645 (4.46 టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం 644 (4.20 టీఎంసీల) అడుగుల వద్ద ఉందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.


దిగువకు విడుదలవుతున్న వరదనీరు

నేటి నుంచి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఆదివారం నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తెలిపారు. శనివారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులమతాలకతీతంగా విరోచితంగా పోరాటం చేశారని, 4500 మంది బలిదానాలు చేశారని కాని, ఈ పోరాటాన్ని కొన్ని పార్టీలు స్వార్థం కోసం రాజకీయంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. వాస్తవానికి తెలంగాణ రాజ్యాన్ని భారత ప్రభుత్వంలో విలీనం చేశారని, దానిని వదిలేసి విముక్తి, విద్రోహం, విమోచనం పేరిట రాజకీయం చేస్తున్నారన్నారు. నాడు జరిగిన పోరాటాన్ని ప్రజలకు వివరించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వమే సెప్టెంబర్ 17న విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 10వ తేదీన ఐలమ్మ వర్ధంతి నిర్వహిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో సాయుధ పోరాటంలో పాల్గొన్న వారిని వారోత్సవాల సందర్భంగా సన్మానించనున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ మండలంలో గూడూరు, తడకమళ్ల, మాడ్గులపల్లి మండలంలోని పాములపాడు, ఆగామోత్కూరు, వేములపల్లి మండలంలోని రావులపెంట గ్రామాల్లో వారోత్సవాల సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 17న నిర్వహించే భారీ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరెపల్లి వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి ముడావత్ రవినాయక్, నాయకులు మల్లు గౌతంరెడ్డి, తిరుపతి రామ్మూర్తి, పిల్లుట్ల సైదులు, బాలాజీనాయక్, బాలునాయక్, వెంకట్‌రెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు.